
కుష్టువ్యాధి

గాంధీజీ దృక్పథం



ఆంగ్లమూలం

యం.యస్. మెహెండలే

గాంధీ స్మారక కు.ని. సంస్థ, వార్ధా.

అనువాదం

పెద్ది సాంబశివరావు

జాతీయ కు.ని. పథకం, ఆంధ్రప్రదేశ్

కుష్టవ్యాధి గాంధీజీ దృక్పథం

ఆంగ్లమూలం

యం.యస్. మొహండలే

గాంధీ స్మారక కు.ని. సంస్థ, వార్ధా.

అనువాదం

పెద్ది సాంబశివరావు

94410 65414, 79891 60680

peddissrgnt@gmail.com, peddissr@yahoo.com

www.teluguthejam.com

ఈ - పుస్తకం ఉచిత దిగుమతి

Kinege.com

teluguthejam.com

30 జనవరి 2019.

కార్యాలయం: శ్రీ అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం, గుంటూరు.

అన్నమయ్య సేవా సమితి, గుంటూరు

అంకితం

ప్రాణులకు బాధలు కలిగించేవి వ్యాధులు. వ్యాధులు రాకుండా చేసేవారు, ఉపశమనం కలిగించేవారు, నిర్మూలించేవారు వైద్యులు, వారి బృందాలు. కొన్ని వ్యాధులు శారీరక మానసిక బాధలనే కాక సామాజిక బాధలను కూడా కలిగిస్తాయి. అటువంటి వ్యాధులు కల వ్యక్తులను సమాజం చిన్నచూపు చూస్తుంది. అలా చిన్నచూపుకు గురిచేసే వ్యాధుల్లో కుష్టువ్యాధి ఒకటి. సరైన అవగాహన లేనందువల్ల ప్రజలు ఈ రకం వ్యాధులపట్ల భయాలు కలిగి ఉంటారు.

ప్రపంచంలో వేల సంవత్సరాల నుంచి వ్యాప్తిలో ఉన్నప్పటికీ గత 70 సం॥రాల క్రితం దాకా ఈ వ్యాధికి సమర్థవంతమైన చికిత్స లేదు. ఆ నేపథ్యంలో దానినొక శాపకారణంగా భావించి, భయపడి సన్నిహిత బంధుత్వాలను కూడా తెగతెంపులు చేసుకునేవారు.

ప్రపంచ వ్యాప్తంగా మహనీయులు-మందులు లేని,కారణం తెలియని-ఆ రోగ పీడితులకు సేవలు చేసి ఉపశమనాలు కల్గించారు. అటువంటి వారిలో గాంధీజీ ఒకరు. ఆయన కుష్టువ్యాధిని అదుపు చేయడానికి శాస్త్రీయత, మానవతా దృష్టిలో ప్రయత్నాలు చేశారు. ఈ సందర్భంగా బాపూ జరిపిన విశిష్టసేవలను గుర్తు చేస్తూ ఈ చిన్న పుస్తకాన్ని ప్రచురిస్తున్నాము.

దీనిని నిరాడంబరులు, బాపూజీతో అనుబంధం కలిగిన పూనా లోని జాతీయ ప్రకృతివైద్యశాల ప్రస్తుత ప్రధాన వైద్యులు, పర్యవేక్షకులు, డా॥ కె. సత్యలక్ష్మి గారికి కృతజ్ఞతలతో అంకితం చేస్తున్నాను.

- *పెద్ది సాంబశివరావు*

30 జనవరి 2019



ఆం.ప్ర. కుష్టు నిర్మూలన శాఖలో ఉద్యోగం. 2001లో పదవీ విరమణ.
రచనలు: కుష్టువ్యాధి-గాందీజీ దృక్పథం, ఫాదర్ డామియన్, బాబా ఆమ్టే, డా॥ హేన్సన్, ప్రచార గేయాలు
పురస్కారాలు: గాంధేయవాది 'ప్రభాకర్‌జీ' స్మారకపతకం.
దేశస్థాయిలో 6 వారాల పర్యటన - హింద్ కుష్ట్ నివారణ్ సంఘ్ సౌజన్యం

Dedicated to the simple
Professor, Doctor and Director



Prof. (Dr) K. Satyalakshmi, ND, M.Phil, Ph.D.

Director, National Institute of naturopathy, Pune, AYUSH, Govt. of India
Bapu Bhavan, (Matoshree Ramabai Ambedkar Road)
Tadiwala Road, Pune – 411001, Maharashtra


Having 30 years of Clinical, Teaching, Research and Administrative experience in various capacities.

Chief Editor **:** "Nisargopachar Varta" monthly bilingual (Hindi/English) Magazine of NIN, Pune.

- Member of National Board of Promotion and Development of Naturopathy and Yoga,
- Technical Expert for NABH.
- Presented various papers on Naturopathy and Yoga,
- Various Television and Radio talks
- Published various articles in newspapers, magazines, Books

Awards:

- Excellency Award,Health Services, Govt. of Telangana State.
- Health Care Excellence Award-2017 from Hon'ble Shri Devendra Fadnavis, Chief Minister of Maharashtra.



మొలకెత్తిన విత్తనాలు

గుజరాత్ రాష్ట్రంలోని “పోర్ బందర్” పట్టణానికి దీవాను కరంచంద్ గాంధీ. ఆయనకు 1869వ సం11ము అక్టోబరు 2వ తేదీన మోహనదాస్ కరంచంద్ గాంధీ జన్మించాడు. ఈ బాలుడే పెరిగి పెద్దవాడై మహాత్మాగాంధీగా, జాతిపితగా రూపొందాడు. ఆయన భారతజాతిని స్వాతంత్ర్య సముపార్జనకై ముందుకు నడిపిన నేత. అంతేకాదు భారతదేశపు సమగ్ర అభివృద్ధిని ఆశించిన దేశభక్తుడు.

గ్రామీణ వికాసం, హరిజనోద్ధరణ వంటి సమస్యలలోనే కాక కుష్టువ్యాధి నిర్మూలన, ఆరోగ్య అభివృద్ధి వంటి అంశాలపట్ల కూడా ఆయన శ్రద్ధ చూపారు.

ఆ రోజుల్లో కుష్టువ్యాధికి సరైన మందులు లేవు. జబ్బుతగ్గుతుందనే ఆశతో రోగులు పురాణ పఠనం, దైవారాధన, జపతపాలు, దానధర్మాలు చేస్తుండేవారు. ఏది చేసినా వారు ఆశించేది కాస్త ఉపశమనం మాత్రమే. రోగులు సమీప బంధువులతో కూడా అసహ్యించుకోబడుతూ, సమాజం నుంచి వెలివేయబడి, వైద్యులచేత అశ్రద్ధచేయబడి, ఊరికి దూరంగా తలదాచుకోవలసిన పరిస్థితులు ఆనాటివి. ఏ కరుణార్ద్ర హృదయులో కనికరించి వేసే పిడికెడు మెతుకులతో ఆకలి తీర్చుకుంటూ కాళ్లు, చేతుల వ్రేళ్ళు కృశించి పోతుంటే అశక్తులై చూస్తూ నిరాశ, నిస్పృహలతో కాలం గడిపేవాళ్ళు రోగులు.

ఆ పరిస్థితుల్లో ఒక ధనవంతుని ఇంట్లో కుష్టురోగి కూర్చొని పురాణం చదవడం అరుదైన సంఘటన. సంపన్నుడైన దీవాను కరంచంద్ అనారోగ్యముతో మంచం మీద పరుండి వుండగా మంచం పక్కనే భిలేశ్వర ఆలయ పూజారి లాధా మహారాజ్ కూర్చొని రామాయణాన్ని చదివి వినిపించేవాడు. ఆ పూజారికి కుష్టువ్యాధి వుంది. బాలుడైన మోహనదాస్ గాంధీ పురాణం వింటూ అక్కడే తిరిగేవాడు. ఆ దృశ్యం బాలగాంధీ హృదయంపై చెరగని ముద్ర వేసింది.కుష్టువ్యాధిని గురించి తెలుసుకునే మొదటి అవకాశం తన ఇంట్లోనే కలిగింది గాంధీజీకి. అంతేకాదు, ఈవ్యాధి అంటే భయం తొలగిపోయింది కూడా. కొన్ని సంఘటనలు ఎంత చిన్నవైనా వాటి ప్రభావం చాలాకాలం నిలచివుంటుంది. గొప్పగొప్ప కార్యాలకు నాందిగా చిన్నచిన్న సంఘటనలు జరుగుతుంటాయి. పెద్దవాడయాక కుష్టురోగులతో కలసి తిరగవలసి వచ్చినపుడు గాంధీజీ భయపడకుండా ఉండటానికి ఇది తోడ్పడింది.

వెలివేయబడ్డ వాళ్ళనుంచి వెలి

మోహనదాస్ గాంధీ పెరిగి పెద్దవాడయ్యాడు. యువ బారిష్టరుగా దక్షిణ ఆఫ్రికా వెళ్ళాడు. శ్వేత జాతీయులు అక్కడి వలస భారతీయులను హింసించడం కళ్ళారా చూశాడు. వాళ్ళకు జరిగే అన్యాయాలను ప్రతిఘటించడానికై "నేటాల్ భారత కాంగ్రెస్"లో సభ్యులను చేరుస్తూ డర్బాన్ లో ఇంటింటికీ తిరిగాడు.

ఒక రోజున అలా వెళుతుండగా ఒక చోట చెట్టు చాటున కొందరు మనుషులు కూర్చొని తొంగి తొంగి చూస్తున్నారు. "వాళ్ళు ఎవరు" అని అడిగారు గాంధీజీ. వాళ్ళు కుష్టురోగులనీ, వ్యాధి కారణంగా సమాజం నుంచి వెలివేయ బడ్డారని చెప్పారు.

వెంటనే బాపూ ఆగిపోయాడు. చేయవలసినపని, చేస్తున్నపని మరచి పోయాడు. అనుచరులు వారిస్తున్నా వినకుండా ఆ రోగుల వద్దకు నడచివెళ్ళాడు. వారితో కాసేపు మనఃపూర్వకంగా మాట్లాడాడు. ఆయన తిరిగివచ్చే సరికి తోటివాళ్ళు "ఎందుకు ఈ ఆలస్యం సమయం వృధా తప్ప"అని సణుగుకుంటున్నట్లు గమనించారు గాంధీజీ.

అపుడు బాపూ "పాపం, ఆ నిర్భాగ్యసోదరులకు నేను ఇచ్చింది ఏముంది? హృదయపూర్వకమైన పలకరింపు మాత్రమే కదా" అన్నాడు. "తెల్లవాళ్ళు మన భారతీయులందరినీ వెలివేసి, హీనమైన వాళ్ళుగా చూస్తున్నారు. మనం అందుకు ప్రతిఘటిస్తూ ఉద్యమం లేవదీస్తున్నాం, బాగానే వుంది. కాని మీరు ఒక్కసారి ఆలోచించారా? మన సమాజంలోని రోగులను మనమే వెలివేస్తున్నాం, బహిష్కరిస్తున్నాం. ఇది ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించాడు.

నిర్దిష్టమైన సేవ

ఆ తరువాత కొన్నేళ్ళకు బాపూ దర్బాన్ లో వుండగా ఒక నాటి సాయంత్రం ఎవరో వచ్చి ఆయన ఇంటి తలుపు తట్టారు. బాపూ తలుపు తెరిచాడు. ఎదురుగా వ్యాధిముదిరి పోయిన ఒక కుష్టురోగి వున్నాడు. ఒక కవళం వేయమనీ, ఒక కానీ ధర్మం చేయమనీ దీనంగా యాచిస్తున్నాడు.

సాధారణంగా అలాంటి పరిస్థితులలో చాలామంది అతనిని అసహ్యించుకొని వెళ్ళిపొమ్మంటారు. లేదా ఎవరో ఒక దయగల తల్లి ఒక ముద్ద అన్నం పెట్టవచ్చు. మరొక బాబు తనకు పనికి రాని పాత గుడ్డను ఇచ్చి పంపవచ్చు. కానీ....బాపూ

ఆ రోగిని తన ఇంట్లోకి రమ్మని పిలిచాడు. ఒక గదిలోకి తీసుకువెళ్ళి అతని పుండ్లను కడిగి వాటికి కట్టుకట్టాడు. ఆ రాత్రి తన అతిథిగా ఉంచుకొని తనతోపాటు అన్నంపెట్టాడు. అంతటితో ఆయన తృప్తి పడలేదు. ఈ విషయాన్ని గురించి గాంధీజీ ఇలా అన్నారు.

"నా వృత్తి బాగానే సాగుతుంది. కాని నాకు మాత్రం సంతృప్తి కలగడంలేదు. నా జీవితాన్ని ఇంకా నిరాడంబరంగా మార్చుకోవాలి. సోదర మానవులకు సేవచేయాలనే తపన నన్ను నిరంతరం ఆందోళన పరుస్తుంది.ఒక కుష్టురోగి వచ్చి నా తలుపు తట్టినపుడు కాస్త అన్నంపెట్టి పంపివేయడానికి నా మనసొప్పలేదు. అతనికి ఆ పూట అశ్రయమిచ్చాను, పరిచర్యలు చేశాను. కాని అతన్ని ఎప్పుడూ నాతోనే ఉంచుకో లేకపోయాను. అందుకు మాకు శక్తి లేకపోయింది. నాకా సంకల్పం కూడా కలగలేదు. తరువాత ఆ రోగిని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాను".

అనంత ప్రేమానురాగాలు

భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత కూడా ఆయనకు ఈ రోగుల పట్ల ఆసక్తి తగ్గలేదు. దేశ స్వాతంత్ర్య పోరాటం ముమ్మరంగా సాగుతుంది.

అందులో భాగంగా ఏ కార్యక్రమం చేపట్టాలోనని నిర్ణయించుకోవడానికి ప్రజాభిప్రాయం తెలుసుకోవడానికై గాంధీజీ దేశమంతటా విస్తృతంగా పర్యటించారు. ఆ పర్యటనలో మద్రాసు వెళ్ళాడు. అక్కడ జాతీయ కాంగ్రెసు స్థాపకులలో ఒకరయిన వృద్ధనాయకుడు కుష్టువ్యాధితో బాధపడుతూ, అవసానదశలో ఉన్నాడని తెలిసింది.

శ్రీనివాసశాస్త్రితో, మరికొందరితో కలసి గాంధీజీ ఆ రోగి ఇంటికివెళ్లాడు. అతని జబ్బు బాగా ముదిరిపోయింది. అతన్ని అంతా మరచిపోయారు. మృత్యువు

కోసం ఎదురుచూస్తూ, ఇంకా ఎన్నాళ్ళు ఈ బాధలు అనుభవించాలా? అనుకుంటూ భారంగా కాలం గడుపుతున్నాడు. బాపూ అతనితో మాట్లాడాడు. ఆసక్తిగావివరాలు తెలుసుకున్నాడు. ఆ రోగి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు. గాంధీజీ అంతటి మహానాయకుడు ఎవరికీ, ఎందుకూ పనికిరాని ఈ కుష్టురోగివద్దకు నడచివచ్చి పలకరించి, పరిచర్యలు చేసి ఆప్యాయతను పంచుతుంటే అది నిజమో, కలో తెలియక అతని హృదయం చలించింది. కొడిగట్టిన దీపం మళ్ళీ కాంతిని చిమ్మింది. కన్నీళ్లు కారి చెక్కిళ్ళ మీదుగా జారిపోయాయి.

శ్రీనివాసశాస్త్రి అందుకే అన్నాడు " బాపూజీకి భయం లేదు, అతను చేయడానికి భయపడిన ఏ పనిని కూడా ఇతరులను చేయమని సలహా ఇవ్వడు. ఆయన ప్రేమానురాగాలు సముద్రమంత విశాలమైనవి" అని.

సేవకు మంచి ఉదాహరణ

ఒక రోజు సాయంత్రం గాంధీజీ పూనాలో తన అనుచరులతో కలసి షికారుకు బయలుదేరాడు. ఇష్టాగోష్టిగా ఏవేవో విషయాలను మాట్లాడుకుంటున్నారు. మానవత, సేవాభావం మీద చర్చ సాగుతుంది. బాపూ వాహ్యాళికి వెళుతున్నాడని తెలిసి ఆయనను చూడాలని జనం మూగారు.అందులో ఆ ప్రాంతంలో ఉండే కుష్టురోగులు కూడా కొంతమంది ఉన్నారు. ఈ రోగులను మిగతావారు దూరంగా గెంటివేస్తున్నారు. ఈ త్రొక్కిడిలో ఒకరోగి రోడ్డు ప్రక్కన పడిపోయి లేవలేక కేకలు వేస్తున్నాడు.

గుంపులో అతని గోడు ఎవరికీ పట్టలేదు. బాపు అనుచరులు ఒకరిద్దరు సాయం చేద్దామని అటువెళ్ళారు. కాని రోగగ్రస్తమైన అతని శరీరాన్ని చూసి భయంతో వెనకడుగు వేశారు. బాపూ అది గమనించి వేగంగా అక్కడకు వెళ్ళి, అతనిని లేవదీసి అతని గుడిసె వరకూ సాగనంపి వచ్చాడు. ఈ సంఘటన వల్ల నాడు జరుగుతున్న చర్చకు ఒక మంచి ఉదాహరణ లభించినట్లయింది.ఎలా సేవచేయాలో చెప్పడానికి

వెయ్యి ఉపన్యాసాలు ఇచ్చేకంటే ఇలాంటి ఒక చిన్న పనిని స్వయంగా చేసి చూపడం మేలు కదా.

ప్రార్థన ఆలస్యమైనా ఫరవాలేదు

1917 లో బీహారు లోని రైతులు తమ నీలిపంట(indigo) అమ్ముడుపోక ఆందోళన చేయసాగారు. నీలిపంట నుంచి రంగుని తయారు చేసేవాళ్ళు. అది వాణిజ్యపంట. దాన్ని కొనేవాళ్ళు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.అక్కడి రైతులతో, వ్యవసాయ కూలీలతో కలసి చర్చించి సాయంత్రానికి వసతిగృహానికి తిరిగి వచ్చాక ప్రార్ధన చేయబోతున్నారు.

బాపు చాలా బాధపడ్డాడు. ప్రార్ధనను వాయిదా వేశాడు. చీకటి పడబోతుంది. ఒక చెట్టుక్రింద కూర్చుని తన కాలిపుండుకు వున్న కట్టును ఒకరోగి సరిచేసుకుంటున్నాడు. అతనిని వెంటబెట్టుకొని శిబిరం వరకు తీసుకువచ్చాడు. తరువాతనే ఆనాటి ప్రార్ధనలను ప్రారంభించాడు గాంధీజీ.

ఊరకే అన్నదమ్ములారా అంటే లాభమేముంది?

1925 ఆగష్టు 20న గాంధీజీ ఒరిస్సాలోని "కటక్" ఆసుపత్రిని చూడటానికి వెళ్ళారు. తన పనులు ఎంతో వత్తిడిగా ఉన్నప్పటికీ అక్కడి కుష్టురోగుల జీవనపరిస్థితులను స్వయంగా తెలుసుకోవాలనుకున్నారు. కాని ఆరోజు కుదరలేదు.

తరువాత సెప్టెంబరు 12 న పశ్చిమ బెంగాల్ లోని పురూలియా లోని రోగుల కాలనీని దర్శించాడు. అక్కడ చాలా వివరాలు తెలుసుకున్నాడు. ఆ కాలనీకి మెకింటోష్ అనే తెల్లదొర సూపరింటెండెంట్ గా ఉన్నాడు. వ్యాధికి కారణం, వ్యాపించే విధానం, మందులు గురించి తెలుసుకున్నారు గాంధీజీ. కుష్టురోగుల కాలనీ సమర్ధవంతంగా నడపాలంటే "ఏమేమి కావాలి? అని అడిగారు బాపు. ప్రార్ధన, కష్టపడి పని చేయడం అన్నాడు మెకింటోష్.ఆ జవాబు విని గాంధీజీ సంతోషించారు. డబ్బుగురించి చెప్పక ప్రార్ధనకు ప్రాధాన్యత ఇవ్వడం ఆయనకు నచ్చింది.

1927 డిసెంబరు 11న గాంధీజీ మళ్ళీ కటక్ వెళ్ళినపుడు ఆయనకి ఒక మిత్రుడు రంగురంగుల చేమంతి పూలగుత్తులు కానుకగా పంపించాడు. గాంధీజీ వాటిని శరణాలయ కుష్టురోగులకు పంపించి తాను అక్కడికి వస్తానని కబురు చేశాడు. మరో మిత్రుడు పంపిన కమలాఫలాల బుట్టను తనతోబాటు తీసుకొని మరుసటి రోజున అక్కడకు వెళ్ళాడు.

అపుడు ఆయన ఆరోగ్యం అంతగా బాగాలేదు.అయినా సూపరింటెండెంట్ కోర్కెను కాదనకుండా మధ్యాహ్నపు ఎండలోనే కాలినడకన దాదాపు అరగంటసేపు కాలనీ అంతా తిరిగి చూశాడు. అక్కడి రోగులనందరినీ కలుసుకున్నాడు. 'మీతో కలసి మెలసి వుండటానికి వెనకాడుతూ, భయపడుతూ మిమ్మల్ని సోదర సోదరీమణులారా అని పిలిస్తే ప్రయోజనం ఏముంది?' అన్నాడు. ప్రతిరోగినీ భుజం తట్టాడు. కొందరి తల నిమిరాడు. ఆత్మీయంగా మాట్లాడాడు. వ్యాధి తీవ్రంగావున్న వాళ్ళతో సహా అందరితోనూ కరచాలనం చేశాడు.

ఎంత మంది ఇలా తాము చెప్పిన దానిని చేసిచూపగలరు? అవును, చాలామంది చేయలేని ఘనకార్యాలను చేసిన వాళ్ళే మహాత్ములు, అందుకే గాంధీజీని మహాత్మాగాంధీ అని ప్రపంచ ప్రజలంతా సగౌరవంగా పిలుచుకున్నారు.

ఆశ్ర మవాసుల ఆరోగ్యం ముఖ్యం

1932 లో గాంధీజీని ఎర్రవాడ జైలులో నిర్బంధించారు. పర్చురేశాస్త్రి అనే కుష్టురోగి కూడా ఆ జైలులోనే వేరుగా అంటురోగుల గదుల్లో వున్నాడు. గాంధీజీ జైలు అధికారులను కలసి శాస్త్రిని చూడటానికి అనుమతి కోరారు. కాని అప్పటి జైలు నియమనిబంధనల ననుసరించి వాళ్ళు ఒకరి నొకరు కలుసుకో కూడదు.అందువల్ల శాస్త్రి సమాచారాలను అడుగుతూ బాపూ ఉత్తరం వ్రాశాడు. ఏమైనా అవసరాలుంటే తెలియజేయమన్నాడు.

శాస్త్రి ఆ ఉత్తరం చదువుకొని ఆనందంతో పొంగిపోయి ఒక సుదీర్ఘమైన జవాబు వ్రాశాడు. తమ దినచర్యలన్నీ అందులో వివరించాడు, తాను కుష్టురోగి అయినందున జైలు గ్రంథాలయంలోని పుస్తకాలు ఇవ్వడం లేదని తెలిపాడు. తన భార్య ఇంటివద్ద అనారోగ్యంతో వుంది కనుక కొంత డబ్బు కూడా అవసరమని వ్రాశాడు. చివరలో ఒక సంస్కృత శ్లోకాన్ని ఉదహరిస్తూ "నా వల్ల సమాజానికి ఏమీ ఉపయోగంలేదు. మరి నా జీవితాన్ని ముగించడమే మంచిదేమో తెలియజేయండి".అంటూ ఆ లేఖను ముగించాడు.

మహాత్ముడు అది చదివి కొన్ని పుస్తకాలను పంపించాడు. డబ్బు కొంత పంపమని కార్యదర్శికి చెప్పాడు. జవాబు ఇలా వ్రాశాడు. 'నీవు నిజంగా ఏ పనీ చేయలేనని, నీవల్ల సమాజానికి ఏ మేలూ జరగదని హృదయపూర్వకంగా భావిస్తూ, నీవు సంఘానికి భారంగా ఉన్నావనుకుంటే నీవు ప్రాణత్యాగం చేయడానికి అభ్యంతరం చెప్పను. కాని అందుకు కూడా ఆత్మహత్య మార్గం కాదు. నిరాహారదీక్ష ద్వారా చేయవచ్చు.

ఆ తరువాత ఇరువురి మధ్య చాలా ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. కొన్నాళ్ళకు హరిజనోద్యమంలో గాంధీజీ చారిత్రాత్మక నిరాహార దీక్ష ప్రారంభించారు. ప్రతిగంట, ప్రతి రోజూ చాలా ఉద్రిక్తతతో గడుస్తుంది. కొన్నాళ్ళకు పూనా ఒప్పందం కుదిరింది. గాంధీజీ తన ఉపవాస దీక్ష విరమించడానికి అంగీకరించాడు. పర్చురేశాస్త్రిని తన వద్దకు పిలిపించమని జైలరుకు చెప్పాడు. బాపూ ఆరుబయట మామిడిచెట్టు నీడన పడుకున్నాడు. జైలునియమాలను ప్రక్కకునెట్టి శాస్త్రిని బాపూ వద్దకు పిలిపించారు. ఆయన వచ్చి బాపూ దగ్గరలో కూర్చొని వేదాలు, ఉపనిషత్తుల నుండి కొన్ని శ్లోకాలు చదివాడు.

ఊరట కల్గించే ఉపదేశం

జైలు నుండి విడుదల కాగానే హరిజన సంక్షేమ పర్యటన ప్రారంభించాడు గాంధీజీ. ఎడతెరపి లేకుండా చేస్తున్న ఆ యాత్రలో ఎలాగో వీలు చూసుకొని కొన్ని కుష్టురోగుల కాలనీలు చూశాడు. 25-11-1933వ తేదిన రాయపూర్, భిలాస్ పూర్ ల మధ్యగల ఛందకురి కాలనీకి వెళ్ళాడు. కాని తమ ప్రియతమ నాయకుడు వస్తున్నాడని తెలిసిన జనవాహిని తండోపతండాలుగా విరుచుకు పడడంతో ఆయన గేటుదాటి లోనికి వెళ్ళే వీలుకాలేదు. తప్పనిసరయి బయటినుంచే వెనుతిరిగి రావలసి వచ్చింది.అక్కడి డాక్టరుకు ఒకసందేశం వ్రాసి యిచ్చాడు. దానిని రోగులకు అందించమని కోరాడు. 'ఈ ఉదయం మిమ్మల్ని ముఖాముఖి చూడలేక పోయినందుకు బాధపడుతున్నాను. మీ వ్యాధి గురించి విచారిస్తూ కూర్చోకండి. రోగగ్రస్తమైన మనసుకంటే రోగంతో వున్న శరీరమే మేలు. మీకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని వేడుకుంటున్నాను' అని వ్రాశాడు అందులో.

రోగుల భావాలను గౌరవించాలి

12-4-1934న గౌహతిలోని మునిసిపల్ కుష్టురోగుల కాలనీని దర్శించారు గాంధీజీ. అది బ్రహ్మపుత్రానదీ తీరాన "పాండు" కు వెళ్ళేదారిలో వుంది. అక్కడి రోగులు ఆయన దర్శనం చేసుకొని గౌరవసూచకంగా వంగి పాదాలు తాకి ప్రణామం చేశారు. అందులో చాలామందికి చేతులకు వ్రేళ్ళులేవు. పాదాభివందనం చేయించుకోవడం మహాత్మునికి ఇష్టంలేదు. అది తెలిసిన అనుచరులు వారించాలని చూశారు. కాని గాంధీజీ తన అనుచరులను ఊరుకోమన్నాడు. తరువాత దారిలో వాళ్ళతో ఇలా చెప్పాడు.

"రోగుల ఇష్టాన్ని గౌరవించడానికే వాళ్ళకు అడ్డుచెప్పలేదు. నా పాదాలు తాకి నమస్కారం చేయడం నాకెంత మాత్రమూ నచ్చదు. కాని వద్దంటే వాళ్ళు

బాధపడతారు. గాంధీజీ కూడా రోగులను చూసి భయపడుతున్నాడనుకుంటారు" అని.

అస్సాం నుంచి వస్తూ బీహార్, ఒరిస్సాలలో పర్యటించాడు. తరవాత ది.29-4-34 న పురూలియా, మేనెల 5వ తేదిన సంబల్ పూర్ కుష్టురోగ చికిత్సా కేంద్రాలని చూశాడు. ఆ కేంద్రపు డాక్టర్లని చాలా ప్రశ్నలువేసి జవాబులు తెలుసుకున్నాడు.

1939 లో గాంధీజీ సేవాగ్రాంకు తిరిగి వచ్చారు. ఒకనాటి సాయంకాలం షికారుకు బయలుదేర బోతుండగా ఎదురుగా ఐదారు అంగల దూరంలో ఆశ్రమంలోకి రాబోతూ ఆగాడొక వ్యక్తి. చేతిలోని బట్టల మూటను అక్కడ పెట్టి గౌరవ పూర్వకంగా నమస్కరించాడు. గాంధీజీ ప్రతి నమస్కారం చేసి "అవును, నీ ఉత్తరం వచ్చింది. నా జవాబు అందేవరకూ ఆశ్రమానికి రావనుకున్నాను" అన్నారు.

అపుడా అతిథి కొంచెం వెనకడుగు వేసి 'మీరు వైస్రాయిని కలసి యుద్ధాన్ని గూర్చి చేసిన విషాద ప్రకటన నన్ను గాఢంగా కదల్చి వేసింది. నేను మీ దగ్గరకు రాకుండా ఉండలేక పోయాను. కనీసం రెండు రోజులయినా వుండి పోదామని,....మీ అనుమతి వచ్చేవరకు ఆగాలని నాకు తెలుసు బాపూ.....కానీ ఎందుకో నన్ను నేను అదుపు చేసుకోలేక పోయాను. హరిద్వార్ వదలి నేరుగా మీదగ్గరకు వచ్చాను" అన్నాడు.

"నీవు బాధపడుతున్న జబ్బుగురించి నాకు తెలుసు, ఐతే నీవువచ్చి ఇక్కడ ఆశ్రమంలో ఇంత మంది స్త్రీ, పురుషుల మధ్య సన్నిహితంగా ఉండటం సరయినదేనా అని నాలో నేను మధనపడుతున్నాను."

అపుడా అతిథి "మీ దర్శనం చేసుకున్నాను, చాలు, నేను వడికిన నూలు చిలపలు మీకు ఇవ్వడానికి తెచ్చాను. నేను వచ్చిన పని అయిపోయింది. ఈ రాత్రికి ఏదో చెట్టు నీడన విశ్రాంతి తీసుకొని ఉదయాన్నే లేచి హరిద్వార్ కు వెళ్ళిపోతాను" అన్నాడు.

''ఇంతకూ ఆహారం ఏమైనా తీసుకున్నావా లేదా?'' అనడిగారు.
"ఉదయం భోజనం చేశానంతే" అన్నాడు ఆ వ్యక్తి. బాపూ వెంటనే కానూ గాంధీని పిలచి ఆ అతిథికి భోజనం ఏర్పాటు చూడమని చెప్పాడు.

భగవంతుని పరీక్ష

సాయంత్రం షికారు కేవలం విశ్రాంతి కోసమే చేస్తారు బాపు. చల్లనిగాలి పీల్చుకుంటూ, సరదాగా నవ్వుతూ, నవ్విస్తూ పసిపాపలతో ఆడుకుంటూ ఆశ్రమ వాసులంతా కలసి కాలక్షేపం చేస్తారు ఆ కాసేపు. కాని ఆ సాయంత్రం మాత్రం గాంధీజీ మౌనంగా, గంభీరంగా వున్నారు. ఏదో ఆలోచనలో మునిగి, ఆంతరంగిక సమస్యతో సతమతమవుతున్నట్లుగా వున్నారు.ఆ సమస్య ఆపూట వచ్చిన అతిథి గురించి. ఆ అగంతక వ్యక్తి పర్చూరే శాస్త్రిగారే.

పర్చూరే శాస్త్రికి అంటురకానికి చెందిన కుష్టువ్యాధి వుంది. శాస్త్రి బాగా కోలుకోసాగాడు, రెండురోజులు వుండి పోదామని వచ్చి రెండుసంవత్సరాలు అలాగే, అక్కడే ఆగి పోయాడు. మెల్లగా కొంచెం దూరం నడవగలిగేవాడు. ఒంటరిగా ఎక్కడో కూర్చునేవాడు. గాంధీజీ తరచుగా శాస్త్రిని కలుసుకుంటుండే వాడు. కాసేపు మాట్లాడి శాస్త్రి హృదయభారాన్ని తగ్గించేవాడు.ఆయన మౌనవ్రతం పాటించే రోజులలో కూడా తన మాటలకు ప్రతీకగా ఒక నారింజపండయినా పంపేవారు బాపూ.

పావలాపెళ్ళి

1940వ సంవత్సరం సెప్టెంబరు ఆరోతేదిన ఆశ్రమంలో ఒక వర్ణాంతర వివాహం చేయవలసి వచ్చింది. దీనికి పురోహితుడు శాస్త్రిగారే. చాలా నిరాడంబరంగా జరిగిన ఈ పెళ్ళికి పావలా మాత్రమే ఖర్చు అయిందట.అందుకే దాన్ని పావలాపెళ్ళి అనేవాళ్లు. పెళ్ళికొడుకు మలబారుప్రాంతపు దీనజన యువకుడు.

బాపూజీ కుటీరం ముందు పెండ్లి జరిగింది. వధూవరులు ఇద్దరికి హిందీ రాదు. ఆందువల్ల మంత్రాలకు అర్ధాలు ఇంగ్లీషులో చెప్పాడు పర్చూరే శాస్త్రి. బాపూజీ

“అమ్మాయిని నీకు ఇస్తున్నాను. సేవచేయడానికి స్వధర్మాన్ని రక్షించడానికి” అని అర్థం వచ్చేశ్లోకాలను చదివాడు.అగ్నిహోత్రుని సమక్షంలో వైదిక ఆచారం ప్రకారం జరిగిన ముచ్చటైన పెళ్ళి ఒక గంటలో ముగిసింది.

ఇక ఆ దంపతుల ఆనందానికి అవధులే లేవు.శాస్త్రి పాండిత్యాన్ని బాగా మెచ్చుకున్నారు బాపూ. దాదాపు రెండేళ్ళ తరువాత వ్యాధి తీవ్రం కావడంతో దత్తాపూర్ కాలనిలో చేరి అక్కడ 1945 లో కన్ను మూసారు పర్చూరే శాస్త్రి.

ప్రారంభానికి కాదు, మూసివేయడానికి వస్తాను


తమిళనాడు ప్రొఫెసరు టి.యన్.జగదీశన్ 1945 ప్రాంతంలో కస్తూరిబా కుష్టు నిలయాన్ని ప్రారంభించడానికి రమ్మని బాపూని ఆహ్వానించాడు. బాపూ వెంటనే “ప్రారంభించడానికి ఎవరినైనా పిలవండి, ఆసుపత్రిని ప్రారంభించడం ఎంతపని, పెద్ద కష్టం కాదు. కుష్టురోగులు ఎవరూ లేకుండా చేయగలిగిన తరువాత దాన్ని మూసివేయడానికి పిలవండి, అప్పుడు నేను వస్తాను” అని జవాబు చెప్పాడు.

1946 ఫిబ్రవరి 4 న చెంగల్పట్ లోని అప్పటి విలింగ్ టన్ లెప్రసీ హాస్పటల్ పక్కగా గల రైలు మార్గంలో ప్రయాణం చేస్తున్నారు గాంధీజీ. ఆ విషయం తెలిసిన రోగులు ఆయనను చూడటానికి రైల్వే క్రాసింగ్ వద్దకు వచ్చి చేరారు. ఆ రోజు బాపూ మౌనవ్రతం పాటించే రోజు. అందువల్ల సంజ్ఞలు మాత్రమే చేశారు. అక్కడొక పసిపాప హరిజన సంక్షేమనిధికి ఒక చిల్లర నాణెం ఇచ్చింది. అది చూడగానే బాపూ కళ్లలో కాంతి మెరిసింది. ఏ భాషా చెప్పలేని, ఏ సుదీర్ఘ ప్రసంగమూ వ్యక్తం చేయలేని సంతృప్తి బాపూ కళ్లలో కదిలాడింది.

అనుమానం నిజమైంది

కుష్టురోగుల పట్ల సానుభూతితో రోగనిర్మూలన ఎడల ఆసక్తితో వ్యాధి గురించి వివరాలు తెలుసుకునేవారు గాంధీజీ. 1946 లో పూనాలోని ప్రకృతి వైద్యశాలలో బాపూ ఉన్నారు. ఆయనకు ఆతిధ్యం ఇస్తున్న వారి ఇంట్లోనే ఒక సేవకుని శరీరం

నిగనిగలాడుతుండటం బాపూజీ గమనించారు. డాక్టరు వద్దకు పంపి పరీక్ష చేయించగా అతనికి కుష్టువ్యాధి ఉన్నట్లు తేలింది. అప్పుడు అతన్ని ఆసుపత్రిలో చేర్చారు. ఆ రోగి ఆరోగ్యం గురించి తరువాత కూడా అడిగి విచారించే వారు బాపూ.



కుష్టురోగుల సమస్యల గురించి తాను ఆలోచిస్తూ, ఇతరులను ఆలోచింప జేసేవారు బాపూ. హరిజన్ పత్రిక ద్వారా, సాయంకాల ప్రార్థనలలోనూ కుష్టువ్యాధి గురించి, రోగులసేవ గురించి ఉదహరించేవారు.ఈ రోగులకు బలవంతంగా సంతాన నిరోధక ఆపరేషన్లు చేయడానికి ఆయన వ్యతిరేకించారు. అదే సంవత్సరం బీహారు ప్రభుత్వం ఈ వ్యాధి గల ఖైదీలకు ప్రత్యేక జైలు గదులను నిర్మించే ప్రయత్నం చేయగా బాపూ దానిని ఆపగలిగారు.

అతిముఖ్యమైన వ్యక్తులు

1947 ఆగష్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కాని మత కలహాలు చెలరేగాయి. గాంధీజీ కలలు చెదిరిపోయాయి. ఆయన హృదయం విలవిలలాడింది.



మతసామరస్యం గురించి, శాంతి ఆవశ్యకత గురించి ప్రచారంచేస్తూ కల్లోలిత ప్రాంతాలలో పర్యటించారు ఆయన. తాను పర్యటనలోవుండగా వచ్చిన ఉత్తరాలలో అతిముఖ్యమైన వాటిని మాత్రమే తనకు పంపమని చెప్పారు. వాటితోపాటు కుష్టువ్యాధికి సంబంధించినవి, కుష్టురోగుల వద్దనుంచి వచ్చిన ఉత్తరాలను అన్నింటినీ పంపించమన్నారు. దీని ద్వారా గాంధీజి కుష్టు నివారణకు ఎంత ప్రాధాన్యత ఇచ్చేవారో అర్థం అవుతుంది.

1947 సెప్టెంబరులో బాపూ కలకత్తానుండి ఢిల్లీ తిరిగి వచ్చారు. రాబోయేముందుగా "గోబ్రా" కాలనీ చూసి వచ్చారు. అక్కడి కుష్టురోగులని, సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు.

గతంలో 1945 ఫిబ్రవరి 9 న డాక్టర్ కాక్రేన్ అను ప్రఖ్యాత కుష్టువ్యాధి నిపుణుడు మద్రాసు ప్రాంతానికి చెందిన ప్రొఫెసరు జగదీశన్ తో కలసి సేవాగ్రాంకు వెళ్ళి బాపూను కలిశారు. దక్షిణ భారతదేశంలో కుష్టునివారణ కార్యక్రమం ప్రారంభించడానికి ఆర్థికసహాయాన్ని అర్థించారు. వాళ్ళు చేయదలచిన పథకాన్ని వివరించారు. బాపూ శ్రద్ధగా విన్నారు. ఆరోజు ఆయన మౌనవ్రతం పాటించే రోజు. అందుచేత ఇలా జవాబు వ్రాశారు. ''కుష్టురోగుల సేవ అంటే నాకు దక్షిణ ఆఫ్రికాలో

ఉన్నప్పటినుంచి అభిలాష వుంది. ఇక్కడకు దగ్గరలోని దత్తాపూర్ కాలనీ చూసి వుంటారనుకుంటాను.అలాగే మీరు కూడా వివరంగా మీ ప్రణాళిక, ఖర్చుల అంచనా తయారుచేసి హెల్త్ బోర్డుకు నివేదించండి''. ఆయన ఆలోచనలు ఎంత శాస్త్రీయంగా ఉంటాయో దీనివల్ల తెలుస్తుంది.

ముందు చేతలు - పిదపనే మాటలు

కుష్ఠువ్యాధిని నిర్మూలించడానికి గాంధీజీ తన కలాన్ని, గళాన్ని తరచుగా ఉపయోగించారు. ఆ రోగుల బాధలను తగ్గించడానికి ప్రయత్నించే వారి ఎడల ఆయనకెంతో గౌరవభావం ఉండేది. రోగులకు సమాజంలో సమాన హక్కులను కల్పించడానికి కృషి చేశారాయన. వారి హక్కుల పరిరక్షణకు అవసరమైతే ఉద్యమమైనా నిర్వహించడానికి వెనుకాడలేదు.

ఆయన రచనలే ఆయన ఆసక్తికి నిదర్శనాలు. ఆ మహాత్ముని ఆలోచనల లోతును, అపార ప్రేమ, ఔన్నత్యాలను తెలియజేసే కొన్ని ఉదాహరణలు చూద్దాం.

ఆయన ఫాదర్ డామియన్ జీవితం చదివారు. డామియన్‌కు సాటివచ్చే త్యాగమూర్తులు అరుదు. బెల్జియం దేశంలో ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించాడు డామియన్. కాథలిక్ క్రైస్తవ మతశాఖలో బోధకుడుగా చేరాడు. తానే కోరుకొని పసిఫిక్ మహాసముద్రంలోని హవాయిదీవులకు వెళ్ళాడు. కొన్నాళ్ల పిదప మొలకాయ్ అనే దీవిలో కుష్టురోగులను వేరుగా వుంచుతున్నారని వారిస్థితి చాలా దయనీయంగా ఉందని తెలిసిన ఫాదర్ డామియన్ ఆ దీవికి వెళ్ళి, రోగులమధ్య నివసించి వాళ్ళ పరిస్థితిని అభివృద్ధి పరిచాడు. ఎనిమిది ఏళ్ళకు ఆయన కూడా ఈ వ్యాధితో మరణించాడు.


ఆ మహాత్ముని ప్రాణత్యాగం ప్రపంచపు కళ్ళు తెరిపించింది. ఈ రోగులంటే సానుభూతి పెరగసాగింది. ఈనాడు కేథలిక్ శాఖ క్రైస్తవులలో సిస్టర్సు, బ్రదర్సు,

ఫాదర్సు కొన్ని వేలమంది ఫాదర్ డామియన్ అడుగుజాడలలో ఈ సేవా రంగంలో కృషి చేస్తున్నారు.

'డామియన్ వంటి ఆదర్శమూర్తులు ఎందరో కావాలి' అంటారు గాంధీజీ.

గౌరవమంతా వారిదే, మరి మన మాటేమిటి?

1925 అక్టోబరు 24 వ తేది "యంగ్ ఇండియా" పత్రికలో బాపూ ఇలా


About That Letter

Reg. No. B. 1922

Subscription { Single copy as. 2 / One year Rs. 5 / Six months Rs. 3

Foreign Rs. 7, 12s., $ 3

Young India

A Weekly Journal

Edited by M. K. Gandhi

Vol. XII — Ahmedabad: Thursday, March 6, 1930 — No. 10

Penal Sections of the Salt Act

[The following sections copied or abridged from the Bombay Salt Act and the Indian Salt Act will show the design underlying their operation. The Bombay Act is a refined reproduction of the India Act of 1882. Most of the penal sections of the Bombay Act show

all goods, packages and coverings in or among which contraband salt is found, and

every apparatus, implement, utensil or material employed for the manufacture, excavation, collection, or removal of salt without a licence or for the purpose of utilizing natural salt or salt-earth contrary to any of the provisions of this Act or any rule made there

వ్రాశారు.

"పురూలియా లోని కుష్టురోగుల శరణాలయానికి కూడా వెళ్ళాను. కాని చాలా హడావుడిగా కొద్దిమంది రోగులను, అక్కడి అధికారులను మాత్రమే చూడగలిగాను.

ఈ రెండు చోట్ల కూడా ఆఫీసర్లు, వాళ్ళ భార్యలు రోగులతో కలసి మెలసి సన్నిహితంగా వుంటున్నారు."

"అక్కడి రోగుల ముఖాలలో అసంతృప్తి కనిపించలేదు. అధికారులు ప్రేమగా చూసుకోవడం వల్లనే వాళ్ళు నిరాశ, నిస్పృహలను మరచి పోగల్గుతున్నారు."

కాళ్ళు,చేతుల వ్రేళ్ళు వంగిపోవటం, పుండ్లు వంటి అంగవైకల్యాలు ఉన్నంత మాత్రాన అటువంటి రోగులు అంటు రోగులు కారు. వీళ్ళ నుండి ఆరోగ్యవంతులకు

వ్యాధి వ్యాప్తి చెందదు. అయితే కొందరు అంటురకానికి చెందిన కుష్టు వ్యాధిగ్రస్తులుంటారు. వ్యాధి ముదిరే వరకు వాళ్ళ జబ్బును వాళ్ళే గుర్తించ లేరు. సమాజం కూడా గుర్తించలేదు. ఈ లోగా వారినుంచి ఇతరులకు వ్యాధి సోకుతుంది. ఇలా రోగుల సంఖ్య పెరిగిపోతుంది.

ఈ పరిస్థితుల్లో నిస్పృహతో నిండివున్న రోగులకు సేవ చేయడం అవసరం. మానవసేవను మనం మరచి పోతున్నాము. విదేశాల నుంచి వచ్చిన క్రైస్తవులు మన దేశస్తులకు సేవలు అందిస్తున్నారు. అందుకు వారిని ఎంతగానో అభినందించాలి.మరి మన మాటేమిటి? ఆలోచించి ఆత్మవిమర్శ చేసుకోవలసిన సమయం ఇదే".

అవసరమైతే విమర్శకూడా

క్రైస్తవ మిషనరీల ఉదాత్త సేవలను ప్రశంసించినప్పటికీ, తనకు కనిపించిన లోపాలను ఎత్తి చూపడానికి వెనుకాడలేదు బాపూజీ.

1925 లోనే ఒక శ్రేయోభిలాషి గాంధీజీని ఇలా అడిగారు. "కుష్టురోగులకు, నిరాశ, నిస్పృహలతో కుంగిపోయే వారికి మిషనరీలు ఎన్నో శరణాలయాలను నిర్మించి నడుపుతున్నారు. మీరు ఎన్నిటిని నిర్వహిస్తున్నారు?"

అందుకు బాపూ "మిషనరీలు శరణాలయాలను, అటువంటి పలు సంస్థలను నడుపుతున్న మాట నిజమే, నేను మాత్రం కనీసం ఒక్క దాన్నయినా స్థాపించలేదు. అందుకు నేను చింతించడం లేదు గూడా. అలాంటి విషయాలలో నేను మిషనరీలతో పోటీ పడదలుచుకోలేదు. భగవంతుడు నన్ను నడిపిస్తున్న మార్గంలో నాకు చేతనైన సేవను తోటివారికి సవినయంగా చేస్తున్నాను. శరణాలయాలు స్థాపించడం, వాటిని నిర్వహించడం మానవసేవలకొక మార్గం మాత్రమే, కాని అదొక్కటే ఉత్తమ మార్గం కాదు.

ఆ ఉత్తమ సేవాభావం వెనుక మతమార్పిడి ఉద్దేశం గనుక వుంటే అందులోని ఉదాత్తత తగ్గిపోయినట్లే" నని, కుండబద్దలు కొట్టినట్లు అన్నారు గాంధీజీ.

అంతేకాదు,సేవ కోసమే నిస్వార్ధంగా సేవ చేయాలి. మిషనరీలలో అలాంటి నిస్వార్ధ సేవకులను నేను ఎప్పుడూ ఎంతగానో గౌరవిస్తాను. హిందువులు ఈ అనాధలను, నికృష్టులను గూర్చి తమకేమీ పట్టనట్లు నిర్లిప్తతతో, పరమమొండి వైఖరితో వున్నారని అంగీకరించడానికి నేను సిగ్గుపడుతున్నాను'' అని కూడాఅన్నారు.

వైద్యం అందరికి అందకపోతే ఎలా?

1939 సం||ము ఫిబ్రవరి 25 న "హరిజన్" పత్రికలో ఇలా వ్రాశారాయన. నాకు వైద్య విధానము పట్ల వింతైన అభిప్రాయాలున్నాయి. వీటిని చాలా ఏండ్లక్రితమే గట్టిగా నొక్కిచెప్పాను గూడా. అయినా ఇన్నేళ్ళు గడిచినా ఆ పరిస్థితుల్లో ఏమీ మార్పురాలేదు. ఇపుడు వాటినన్నిటినీ మీకు వివరించను. నేను చాలా మిషనరీ ఆసుపత్రులను చూశాను, వాళ్ళు చేస్తున్న ప్రశంసనీయమైన కుష్టురోగుల సేవలను గూడా గమనించాను, అసలు ఈసేవలో వారికి వారేసాటి. వారిదొక ప్రత్యేక విధానం. సేవ చేయడం వారికి వెన్నతో పెట్టిన విద్య. ఇంకెవరూ అలా సేవ చేయడానికి ముందుకు రావడంలేదు.

నేను కటక్, పురూలియా ఆసుపత్రులు చూశాను, అలహాబాదులో శ్రీమతి హిగిన్ బాదమ్ చేస్తున్న పనులు తెలుసుకున్నాను. ఆ రోగుల కాలనీలు చూడాలని వుంది నాకు. ఇంకా చాలా చోట్ల కూడా చూశాను. అయినా ఇంత విస్తారంగా సేవలు చేస్తున్న మిషనరీలు కూడా అసలు సమస్యను ఎదుర్కొనలేక పోయారు. కుష్టు రోగులకు, క్షయరోగులకు, అంధులకు మరి కొందరికి చెప్పుకోదగిన సహాయం అందుతూనే ఉంది, కాని ఆ సహాయం ఈ సువిశాలదేశంలోని మరెన్నో లక్షల గ్రామీణ ప్రాంత బాధితులకు అందటం లేదు. వైద్యసహాయం ప్రధానంగా నగరాలలోను, ఆ పరిసర ప్రాంతాలలోను అందుతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు.


నిపుణుల సలహాలకు వెనుకంజ వేయడు

తన వైద్యవిజ్ఞాన పరిమితులు గాంధీజీకి తెలుసు. అందువల్ల ఆయా రంగాలలో నిపుణులచేత పత్రికలకు వ్యాసాలు రాయించే వారు. తాను ముందుగా పరిచయం వ్రాసి, నిపుణుల అభిప్రాయాలను తరువాత వ్రాసే వారు. అలాంటిది ఒక ఉదాహరణ చూద్దాం.

మహారాష్ట్ర లోని ఒక తహశీల్ వార్ధా. అక్కడ చాలామంది కుష్టురోగులు ఉన్నారు. వేర్వేరు పనుల నిమిత్తం గ్రామసేవకులు తరచు ఈ రోగులతో కలవవలసి వచ్చేది. అలాంటి సమయాలలో ఆ కార్యకర్తలు ఏం చేయాలి? వారు కుష్టు రోగులతో కలసి సంచరించవచ్చునా? ఈ కార్యకర్తలు రోగులకు ఏదైనా సహాయం చేయాలంటే ఎలా చేయాలి? ఈ వ్యాధికి ఏదైనా చికిత్స ఉన్నదా? అనేవి కార్యకర్తలకు తరచుగా కలిగే సందేహాలు.

అనుభవజ్ఞులైన డాక్టర్ డోనాల్డ్ మిర్రర్ ను ఈ ప్రశ్నలకు జవాబులు అడిగారు. ఆయన ఉత్తరాల ద్వారా జవాబులు పంపించాడు. ఈ ఉత్తరాలన్నింటినీ కలిపి పునర్ముద్రించారు గాంధీజీ. ''కరుణకల మానవులు రోగుల సంక్షేమం కోరేవారు వీటిని తప్పక చదవాలి. ఈ కరపత్రాలు పూనాలోని హరిజన్ పత్రిక కార్యాలయంలో లభిస్తాయి'' అని గమనిక వ్రాశారు.

మరో సందర్భంలో సావ్లీ అనే చోట చేనేత పనివారి గుడిసెలలో దయనీయంగా నివసిస్తున్న రోగుల గాథలను ఉదహరిస్తూ డా.మ్యూర్ కుష్టు వ్యాధిపై



రాసిన ప్రసిద్ధగ్రంథంలోని "వ్యాధి రాకుండా చూచుకోవడం ఎలా?" అనే అంశాలను "హరిజన్"పత్రికలో వ్రాశాడు.

"కుష్టురోగులు పిల్లలను కనవచ్చునా?" అని ఎవరో ప్రశ్నించారు. దానికి గాంధీజీ లండన్ లో ఉన్న ఆయన మిత్రుడిని అడిగి జవాబు తెలుసుకున్నాడు. అనేక వ్యాపకాలలో మునిగి ఉన్నప్పటికీ, ఈ వ్యాధి గురించి వ్రాయడానికి, ఈ కాలనీలను దర్శించటానికి వీలు చూసుకునే వారాయన. దత్తాపూర్ లోని కాలనీ గురించి అనేకసార్లు హరిజన్ పత్రికలో వ్రాశారు గాంధీజీ.

12-12-1944 లోనే మొదటిసారిగా ఈ కాలనీని ఆయన చూశారు. చూసి వస్తూ అక్కడ ఉన్న సందర్శకుల అభిప్రాయాల పుస్తకంలో ఇలా వ్రాశారు "ప్రజలు నన్నొక మహాత్ముడు అని పిలుస్తున్నారు, కానీ నేను మహాత్ముడిని కాను. ఇక్కడ కుష్టు రోగుల సేవకే అంకితమై పోయి నిస్వార్ధంగా సపర్యలు చేస్తున్న మనోహర్ దివాన్ జీ అసలైన మహాత్ముడు."

"నేను వచ్చే దాకా పోవద్దు."

సేవాగ్రామ్ ఎంతమందినో ఆకర్షించింది. అలా ఆకర్షింపబడిన ముఖ్యులలో డాక్టర్ వాడేకర్ ఒకరు.

డా. వాడేకర్ యం.డి. పెథాలజీ నిపుణుడు. ముంబైలో ఒక ఆసుపత్రిలో పని చేస్తుండేవాడు. ఒకసారి ఆయన సేవాగ్రామ్ చూడటానికి వచ్చారు. వచ్చీరావడం తోనే ఆయన హృదయం ఇక్కడ చిక్కుకు పోయింది. ఇక్కడ సంగతులన్నీ చూసుకొని ముంబై వెళ్లాడు. అక్కడ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి తిరిగి వచ్చాడు. కస్తూరిబా ఆసుపత్రిలో పనిచేయసాగాడు.

క్విట్ ఇండియా ఉద్యమానంతరం నిర్బంధం నుండి గాంధీజీ ఆశ్రమానికి రాగానే ఈ లోగా అతిథులకోసం నిర్మించబడిన బిర్లా భవనానికి ఆసుపత్రిని మార్చారు. అప్పటినుండి అది 'కస్తూర్ బా ఆసుపత్రి' అని పిలవబడుతుంది.

ఆశ్రమానికి నాలుగు మైళ్ల దూరాన ఉన్న వార్ధాలో కుటుంబసమేతంగా ఉండేవారు డా.వాడేకర్. నిత్యం ఉదయం 8 గంటలకు ఆసుపత్రికి వస్తారు. మధ్యాహ్నం ఆసుపత్రిలోనే భోజనం చేస్తారు. సాయంత్రం తిరిగి వార్ధా వెళుతుండేవారు.

డా. వాడేకర్ ఆశ్రమ వాతావరణంలో ఇమిడిపోవడానికి కొంతకాలం పట్టింది.

ఆయన నియమం తప్పకుండా వచ్చి ఆసుపత్రి పనులు నిర్వర్తించేవారు. తాను గొప్ప డాక్టరుననే గర్వం లేకుండా గ్రామస్తులతో కలసిమెలసి ఉంటూ రోగులకు ఉపచారాలు చేస్తుండేవారు. రోగులకు మందులివ్వడం కన్నా వారికి రోగకారణాలను, స్వభావాలను వివరించి చెప్పి రోగమూలాలను తుంచివేసే క్రమశిక్షణా పద్ధతులలో వారిని నడుపుతుండే వారు. ఆసుపత్రి వ్యవస్తలో సామాన్య ప్రచారకునికి, డాక్టరుకు బేధం పాటించటం అనేది లేదు. పాయిఖానాలు పరిశుభ్రం చేయడం మొదలు రోగుల సేవల వరకు అందరూ కలిసే చేస్తుంటారు.

డా.వాడేకర్ అక్కడ ప్రవేశించిన రోజు ఆసుపత్రిలో ఒకరోగి చనిపోయాడు. ఆయనకు అది తొలి పరీక్షాదినం అయింది. ఆశ్రమవాసులతో పాటు ఆయన కూడా శవాన్ని మోసి, దహనసంస్కారాలు జరిపించాడు. డాక్టర్ చాలా చురుకైనవాడు, నిపుణుడైన డాక్టర్ కావటంచేత ఆయనకు కొత్త ఆలోచనలు చాలా వస్తుండేవి. ఆపరిసరాలలో ఉన్న నలబై గ్రామాల వైద్యసేవకు చేయవలసిన పనులగూర్చి ఆస్పత్రి వ్యవస్థాపకుడైన ప్రభాకర్‌జీతో ముచ్చటిస్తుండేవారు. అంతేకాదు, ఎన్నోపథకాలు వేస్తుండేవారు. ఈ పథకాలను ఆచరణలో పెట్టలేక డాక్టరును వదలుకోలేక ప్రభాకర్‌జీ, ఎప్పటికప్పుడేవేవో సమాధానాలు చెబుతూ కాలం గడుపుతున్నారు.

1946 లో బాపూజీ, నవఖాళి వెళ్ళి అటునుంచి అటే ఢిల్లీ వెళ్ళారు. తిరిగి రాలేదు. డాక్టరు సుశీలానయ్యర్ కూడా గాంధీజీ దగ్గర ఢిల్లీలో ఉన్నారు. ఆస్పత్రి నిర్వహణను గూర్చి ప్రభాకర్‌జీ సుశీలా నయ్యర్‌కు వారంవారం నివేదిక

పంపుతుండేవారు.ఒక వారం పంపిన నివేదికలో డాక్టర్ వార్డేకర్ గురించి కొన్ని సంగతులు తెలియపరిచారు ప్రభాకర్జీ. డాక్టరు శక్తి సామర్ధ్యాలను వివరిస్తూ ఢిల్లీకి రావలసిందని బాపూజీ వ్రాయించారు.

ఢిల్లీ చేరగానే ప్రభాకర్జీ గాంధీజీకి, సుశీలా నయ్యర్‌కూ అన్ని సంగతులు విశదం చేశారు. డాక్టరు వార్డేకరు గాంధీజీని కలిసి మాట్లాడటం అదే మొదటిసారి.

డాక్టరు కష్టసుఖాలను, మనః ప్రవృత్తినీ వివరంగా ప్రశ్నించి తెలుసుకున్నారు బాపూజీ. "వచ్చే సంవత్సరానికి మీబడ్జెటు ఏమి వేసుకున్నారు**?**"అని ప్రశ్నించారు. మామూలుగా ప్రతి సంవత్సరం ఆస్పత్రి బడ్జెటు గాంధీజీ ఆమోదించిన పిమ్మటనే అమలు చేస్తారు. ఆ సంవత్సరం బడ్జెటులో 30 వేల రూపాయలు 40 గ్రామాలలో రోగనిరోధక కార్యక్రమాల కొరకు కేటాయించారు.

గాంధీజీ అన్నారు. "రోగ నివారణకు ఇది చాలాఎక్కువ, రోగ నిరోధానికి మీరెంత కేటాయిస్తారో కేటాయించండి. నేను సంతకం చేస్తాను. అంచనాలు తయారు చెయ్యండి" అని డాక్టరును వేలెత్తి చూపుతూ. "కాని, నేను వచ్చే వరకు పారిపోవద్దు సుమా" అన్నారు నవ్వుతూ.

డాక్టరు, ప్రభాకర్‌జీ సేవాగ్రాం తిరిగి వచ్చారు, అంచనాలు తయారు చేశారు. కాని, బాపూజీ ఢిల్లీ నుండి సేవాగ్రాంకు మరలి రానేలేదు, డాక్టరు వార్డేకరు సేవాగ్రాం వదలనేలేదు.

సంఘసేవయే మానవత్వం

ఒక పాఠకుడు హరిజన్ పత్రికలో బాపూజీని ఒక ప్రశ్న అడిగాడు, "భారతదేశంలో చాలామంది నిర్భాగ్య జీవులున్నారు, ప్రతి పట్టణంలోను అవిటివాళ్ళు, బిచ్చగాళ్ళు వున్నారు, వీరిలో చాలామంది కుష్టురోగులు కూడా వున్నారు. వారి దయనీయ జీవితాలు మీ కరుణ, గుర్తింపు పొందడానికి అర్హమైనవి

కావా**?** మీ వుద్యమంలో భాగంగా మీ నిర్మాణ కార్యకర్తలందరూ ఇలాంటి వారికి కనీసం ఒక్కపూట అన్నం పెట్టాలని నిర్ణయించగూడదా"**? అని.**

అందుకు బాపూజీ ''మీరు సూచించిన అంశం నిస్సందేహంగా అమూల్యమైనదే. కాని నిర్మాణ కార్యక్రమంలో అదొక భాగం కాలేదు. ప్రతి వ్యక్తి-స్త్రీ గాని, పురుషుడు గాని - కాంగ్రెసుగాని మరే పార్టీవారు గాని-తనవంతు సంఘసేవను చేయకపోతే వారికి మానవత్వం లేనట్లే'' అని జవాబు ఇచ్చారు.

1940 లో కుష్టువ్యాధినిర్మూలనను నిర్మాణ కార్యక్రమంలో భాగంగా చేర్చడానికి బాపూ అంగీకరించలేదు. కాని 1945 సం. లో చేర్చారు. ఎందువల్ల ఆయన అభిప్రాయం మారిందో తెలియదు. 1945 లో పరిస్థితులు మారాయి. రెండవ ప్రపంచ యుద్ధం ఐపోయింది. బ్రిటన్ సార్వభౌమాధికారం బీటలు వారింది. దూరదృష్టి గల గాంధీజీ భారతదేశ స్వాతంత్ర్యన్ని కనుచూపు మేరలో ఊహించి వుంటారు. స్వతంత్ర్యం వచ్చి తలుపు తట్టబోతుంది. తన నిర్మాణ కార్యక్రమాన్ని విస్తరింపజేయడం అవసరమని తలచి వుంటారు. అందుకే కొన్ని కొత్త అంశాలను అందులో చేర్చారు. దానిలో కుష్టువ్యాధి నివారణ గురించి వ్రాశారు. ''కుష్టు అనేమాట ఇబ్బంది కల్గిస్తుంది. ప్రపంచంలో మధ్య ఆసియా తరువాత భారతదేశంలోనే ఈ వ్యాధిగ్రస్తులు ఎక్కువమంది వున్నారు''.

''సమాజంలో కొందరు పొడవుగాను, కొందరు పొట్టిగానువుంటారు అయితే పొడవాటి వాళ్ళకు ఎక్కువ గుర్తింపు ఇస్తాం. అలా ఎందుకు చేయాలి**?**అదే సమాజంలో మరోభాగమైన కుష్టు రోగులను పట్టించుకోకుండా ఉండటమెందుకు**?** అది అమానుషం కదా !''

''భారతదేశం నవజీవనం కోసం ఉరకలు వేస్తుంటే సత్యం,అహింసల ద్వారా మనందరం స్వాతంత్ర్య సముపార్జన చేయదలచుకుంటే, మనం మన దేశంలో ఏ ఒక్క కుష్టురోగిని కూడా నిర్భాగ్యుడిగా పట్టించుకోకుండా వదలివేయరాదు. అందుకే


నిర్మాణ కార్యక్రమం అనే గొలుసులో కుష్టువ్యాధి నిర్మూలన అనే అంశాన్ని చేరుస్తున్నాను'' అన్నారుబాపూ.

అరగంటలో అఖిల భారత సమావేశం

మనోహర్ దీవాన్‌జీకి అఖిలభారత కుష్టుసేవా కార్యకర్తల సమావేశం జరపాలనే ఆలోచన కలిగింది. గాంధీజీ ఆ ఆలోచనను తోసిపుచ్చుతూ "ఏరి**?** కార్యకర్తలు ఎంతమంది ఉన్నారు**?** నాకు వంద మందిని చూపించండి అరగంటలో సమావేశం ఏర్పాటుచేస్తాను" అన్నారు

తరువాత కస్తూరిబా ట్రస్ట్ వైద్య సలహ కమిటీలో **ది.29-3-**1947న ఈ విషయం మళ్ళీ చర్చకు వచ్చింది. "తగినంతమంది కార్యకర్తలు లేనిమాట నిజమే అందుకే ఎక్కువ మందిని ఆకర్షించడానికే ఈ సమావేశం జరిపి తీరాలి అని జీవరాజ్ మెహతా వాదించాడు.

డాక్టర్ సుశీలా నయ్యర్ మరికొందరు అంగీకరించారు. ప్రొఫెసరు జగదీశన్ కూడా పట్టుదలతో చాలామందికి చాలాకాలం నుంచి ఉత్తరాలు వ్రాస్తున్నారు. చివరకు 24 అక్టోబరు 1947 న సమావేశం జరిగింది. గాంధీజీ ఈ సభకు రావడానికి అంగీకరించినా అప్పటి రాజకీయ అలజడులవల్ల ఢిల్లీ వదలి రాలేకపోయారు. ధక్కర్ బాపా దీనిని ప్రారంభించి, ఉపన్యసించారు.





ఈ సమావేశం జరగడానికి ముందు వరసగా రెండు రోజులు ప్రార్ధనా సమయాలలో ఈ వ్యాధి గురించి ఉదహరించారు గాంధీజీ. ‘‘అంటుజబ్బులు చాలా ఉన్నాయి. గజ్జి,కలరా, టైఫాయిడ్ కలరా వంటివి. వీటన్నిటి కంటే తక్కువ అంటు వ్యాధి కుష్టువ్యాధి. అయినా ఎందుకో ఈ రోగులంటే అంతభయం! ఆ భయం నిరాధారమైనది, నిర్హేతుకమైనది. కుష్టురోగిని కుష్టువాడు అని పిలవడం ఎంత అమానుషం. సాటి వారిని హీనంగా చూస్తూ, ఒక జీవిని, తెగను వెలివేసినట్లు చూడటం,శారీరక వ్యాధికంటే హీనాతి హీనం. అలా చూసే వా రివల్లనే సమాజానికి ఎక్కువ హని కలుగుతుంది.వారే సంఘానికి చీడపురుగులు అన్నారాయన.

అంతిమశ్వాస

1948 జనవరి 30 వ తేదీన అహింసామూర్తి గాంధీజీ ఒక మతోన్మాది తుపాకి గుండ్లకు గురయ్యారు. భారతదేశంలో విషాదం అలుముకొన్నది. యావత్ ప్రపంచం నిశ్చేష్టమయింది. మహాకవి జాషువా గారన్నట్టు అదొక ఘోర దుర్దినము

“అది తలపోయరాని హృదయపు విదారి, విషాద వాచ్య కా
సృదమయి, పంచఖండములు బావురు మన్న పిశాచివేళ ము
ప్పదికోట్ల భారత తపస్సముదాయము, భస్మరాశియై
చిదికిన ఘోర దుర్దినమిసీ వచియింపగ, జిహ్వాలాడునే”

ఈ హఠాత్ సంఘటన జరిగి కొన్నేళ్ళు గడిచాయి. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా వేర్వేరు పథకాలను అమలు చేయడానికై ‘గాంధీ స్మారకనిధి’ ని ఏర్పాటు చేసారు.1951సం ము లో అందులో భాగంగా గాంధీ స్మారక కుష్టు ఫౌండేషన్ స్ధాపించబడింది. దానికి వార్దేకర్ డైరక్టరుగా నియమితులయ్యారు.

అపుడు భారతదేశంలో 15 లక్షల మంది కుష్టురోగులున్నారనీ అందులో మూడు లక్షల మంది అంటురకం జబ్బుకలవారని అంచనా. ఆనాడు దేశం మొత్తంలో రెండువందల దాకా కుష్టు రోగులకాలనీలు వున్నాయి. వీటన్నిటిలో 15 వేల మంది

కంటే ఎక్కువ రోగులు వుండే వీలు లేదు.అంటే అంటురోగుల్లోకూడా 5 శాతం మందినే ఆసుపత్రిలో ఉంచే వీలుంది. వీళ్ళుకాక మరో లక్ష మందికి బయట రోగులుగా చికిత్స మందులు వాడుతున్నారు.

బాపూ చనిపోయిన రెండేళ్ళకు డాప్సోను అనే మందుబిళ్ళలు ఈ వ్యాధికి బాగా పని చేస్తాయని అమెరికాలో కనుగొన్నారు. ఈ బిళ్ళలు వ్యాధి కారక క్రిముల వ్యాప్తిని ఆపుతాయి. అంటువ్యాధి తీవ్రతను నిదానముగా తగ్గిస్తాయి. వాడటం సులువు, ఖరీదు తక్కువ.కానీ ఈ మందును కొన్ని సంవత్సరాల తరబడి, జీవితాంతమూ వాడాల్సి వుండేది.


ఈ నూతన ఔషధాన్ని రోగులందరికీ అందేలాగా చేయడమెలా**?** అని ఆలోచించి “గాంధీ మెమోరియల్ లెప్రసి ఫౌండేషన్'' వారు ఒక పథకాన్ని రూపొందించారు.


ఈ పథకాన్ని పలురకాల ప్రయోజనాలు కల్గిస్తుందని రుజువు అయింది.

బాపూ వేర్వేరు సందర్భాలలో చెప్పిన విషయాలను పర్యావలోకనం చేసుకుంటే ఆయన ఆశయాలకు ఈ పథకం న్యాయం చేకూర్చిందనుకోవచ్చు. “జబ్బులు వచ్చాక తగ్గించుకోవడం కంటే రాకుండా / చూసుకోవడం మేలు. పారి శుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి”.


“ఆధునిక నాగరిక జీవనంలో పారిశుద్ధ్యమే సుఖానికి మొదటి మెట్టు.భారతదేశం లో ఇది కేవలం మొక్కుబడిగా మారింది. మాకు పరిశుభ్రత తెలుసు, పాటిస్తాం, మాకు ఆ స్పృహ వుంది . అని మనం చెప్పుకోగలగాలి”. “మనది విశాలదేశం. మనవి భిన్న సమస్యలు. నిధులు,సిబ్బంది, విద్యాసౌకర్యాలు అన్నీ కొరతలే. మన ప్రధాన సమస్యలు పల్లెలలో మరీ తీవ్రంగా వున్నాయి. పెద్ద పెద్ద సంస్థలను నగరాలలో స్థాపిస్తే ప్రయోజనమేమిటి**?** పల్లెలకు వెళ్ళండి. మీ సేవలు అక్కడ అందించండి”. అనేవారు బాపూజీ తన అనుచరులతో, కార్యకర్తలతో.

“వైద్యం కోసం ప్రజలు రాకూడదు. ప్రజల దగ్గరకు వైద్యం పోవాలి” ఇవి ఆయన చెప్పిన కొన్ని సూక్తులు.






మైక్రోస్కోపులో కుష్టు క్రిములను పరిశీలిస్తున్న బాపూ



మొలకాయ్ దీవులకు వెళ్లి కుష్టురోగులకు సేవలు చేసి తాను కూడా వ్యాధి బారిన పడి అసువులు బాసిన బెల్జియం ఫాదర్ డామియన్.



1873 లో కుష్టు వ్యాధి రావటానికి కారణమైన క్రిములను కనుగొన్న నార్వే దేశపు శాస్త్రవేత్త డా॥ హేన్సన్